# జింబాబ్వేలో ముగాబే తొలగింపు

## సామ్రాజ్యవాదుల, ఆధిపత్యశక్తుల కుటిల చర్యల ఫలితమే




**జింబాబ్వే** అధ్యక్షుడైన రాబర్ట్ ముగాబే ఆ దేశ సైన్యం నుండి, పార్లమెంటు నుండి వ్యక్తమైన వత్తిడి ఫలితంగా గద్దె దిగాడు. ముగాబే తన తరువాతి అధికారస్థానంలోనున్న మనన్‌గాగ్వాను అధికారం నుండి తొలగించటంతోపాటు, తన భార్య అయిన గ్రేస్ ముగాబేను తన వారసు రాలిగా ప్రకటించటం ఆయన తొలగింపుకు తక్షణ ప్రేరేపకంగా వుంది. ఎమర్సన్ మనన్ గాగ్వా జింబాబ్వే అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించటంతోపాటు, స్వేచ్ఛా సౌభాగ్యాలతో కూడిన భవిష్యత్తును వాగ్దానం చేశాడు. ఇన్ని సంవత్సరాలుగా కష్టాలను, క్రూర నిర్బంధాలను భరిస్తున్న విశాల ప్రజానీకమంతా నాయకత్వంలో జరిగిన ఈ మార్పును స్వాగతించి సంబరాలు చేసుకున్నారు. ముగాబే గద్దెదిగి పోవటం ప్రజా జీవితాలలో ఏమైనా అభివృద్ధిని తీసుకొస్తుందా?

జింబాబ్వే ఒకనాడు బ్రిటిష్ వలస దేశంగా వుండేది. ఆనాడు దానిని దక్షిణ రొడీషియాగా పిలిచేవారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 15 సంవత్సరాల సాయుధ పోరాటం తర్వాత 1980లో ముగాబే అధికారంలోకి వచ్చాడు. 'లాన్‌కాస్టర్ హౌస్' ఒప్పందంలో భాగంగా 1980లో ఎన్నికలు జరిగి, ముగాబే నాయకత్వం లోని 'జింబాబ్వే ఆఫ్రికన్ నేషనల్ యూనియన్' (జెడ్ఏఎన్‌యు) ఎన్నికలలో విజయం సాధించింది. జింబాబ్వే గనులను, వ్యవసాయరంగాన్ని దోపిడీ చేసుకెళ్తూ, వానిపై ఆధిపత్యం వహించే బహుళ జాతి కంపెనీలను అనుమతించే విధానాలను కొనసాగించటానికి ముగాబే అంగీకరించాడు.

మొక్కజొన్న, పత్తి, టీ, పంచదార, పొగాకు, గోధుమలు, పాల ఉత్పత్తులు, పాడిపరిశ్రమను ప్రోత్సహించి, జింబాబ్వే వ్యవసాయరంగాన్ని ఎగుమతికి అనుకూలమైనదిగా వలసపాలన రూపొందించింది. ఈ విధానం యొక్క ప్రధాన ఆధారం–స్థిరపడిన శ్వేతజాతి భూకామందులు. దేశంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 40 శాతం, సారవంతమైన భూభాగంలో మూడింత రెండువంతుల భూమి, వీరి చేతుల్లో వుంది. మూడింట రెండువంతుల నల్లజాతి కార్మికులు రోజుకూలీలుగా ఈ భూములలో శ్రమచేసే వారుగా వున్నారు.

భూమి పునఃపంపిణీ అనేది విముక్తి పోరాటపు ప్రధాన డిమాండ్. ముగాబే 1980లో అధికారంలోకి వచ్చేనాడు శ్వేతజాతి భూకా మందుల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహ రించబోనని, అధికసంఖ్యలో ప్రజలు భూమిని కోరుకుంటున్నప్పటికీ, పది సం॥ల కాలం భూకామందుల భూముల జోలికి వెళ్ళబోనని, తర్వాత పరస్పర అంగీకారంతో అమ్మకాలు – కొనుగోలు ప్రాతిపదికన భూములను శ్వేత జాతీయుల నుండి తీసుకొంటామని ప్రకటించాడు.

జింబాబ్వే దేశంలో ప్లాటినం, బంగారం, ఇనుము, బొగ్గు, మరెన్నో అమూల్య ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇటీవలి కాలంలో వజ్రాల తవ్వకాలు కూడా చేపట్టారు. ఈ గనుల రంగం పైన ఆధిపత్యమంతా బహుళజాతి కంపెనీలదే. ముగాబే తన పాలనకు ఇబ్బంది లేకుండా చూసుకున్నాడు. బ్రిటిష్, అమెరికా సామ్రాజ్య వాదులకు అతను విశ్వాసపాత్రుడిగానే వున్నాడు. విదేశీ సహాయం, ఋణాలు సాఫీగా నడిచి పోతున్నాయి.

నల్లజాతీయుల ఆకాంక్షలకు వెన్నుపోటు పొడవటం అశాంతికి కారణమైంది. ముగాబే దీనిని క్రూర నిర్బంధంతో అణచివేయటంతో పాటు తెగల మధ్య వైరుధ్యాలను ప్రత్యేకించి షోనా ప్రజలకు, డెబెలే ప్రజలకు మధ్యనున్న వైరుధ్యాలనుపయోగించి ప్రజల ఐక్యతను దెబ్బ తీసి, వారి ఉద్యమాలను అణచివేశాడు. షోనాయేతర ప్రజలపై అతను మారణకాండ సాగించాడు. పార్లమెంటును రద్దుచేయటం, సైనిక పాలనను ప్రకటించే అధికారంతో సహా కార్యనిర్వాహక అధికారాలన్నింటినీ ముగాబే తనవద్దే కేంద్రీకరించుకొన్నాడు.

1990 నాటికి నిశ్చితంగా అతను అధికారంలో కుదురుకున్నాడు. ఎన్నికలలో లబ్ధి పొందేందుకు శ్వేతజాతీయుల చేతుల్లోనున్న 1 కోటీ 30 లక్షల ఎకరాల భూముల పంపిణీ కార్యక్రమం చేపట్టాడు. సామ్రాజ్యవాదుల నుండి వత్తిడి పెరగటంతో, 'సమంజసమైన నష్ట పరిహారాన్ని' న్యాయస్థానాలు నిర్ణయిస్తాయని ప్రకటించాడు. ఈ భూపంపిణీ కార్యక్రమం – రాజకీయ నాయకులకు, తన పార్టీ వారికీ, పౌర అధికారులకు, సైనిక బలగాల సభ్యులకు లబ్ధి చేకూర్చింది. గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలకు సరైన పరిష్కారాన్ని ఈ భూపంపిణీ విధానం చూపలేకపోయింది.

అదే సమయంలో గనుల పరిశ్రమను జాతీయం చేయటం, స్థానికులకే అప్పగించటం గురించి ముగాబే మాట్లాడాడు. దీనితో ద్రవ్య పెట్టుబడిదారీవర్గం ఆగ్రహించింది. ఐఎమ్ఎఫ్ నిధులలో కోత విధించింది. విదేశీ పెట్టుబడికి, ప్రైవేటీకరణకు, వ్యవస్థీకృత సర్దుబాటులో భాగంగా అంతులేని దోపిడీకి జింబాబ్వే ఆర్థిక వ్యవస్థను తెరచి వుంచమని డిమాండ్ చేసింది.

ఈ చర్యలు ప్రజలలో తీవ్ర అశాంతికి కారణమై 1997, 1999లలో సార్వత్రిక సమ్మెలు జరిగాయి. జింబాబ్వే కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (జెడ్‌టిసియు), మూవ్‌మెంట్ ఫర్ డెమోక్రసి (ఎమ్‌డిసి)లు – ముగాబే చర్యలను మొదటినుండీ వ్యతిరేకిస్తూ వచ్చాయి. శ్వేత జాతీయులైన భూకామందులతో ముగాబే కూటమిని ఏర్పరచుకొని 'ప్రైవేటీకరణ మరియు వ్యాపార నమ్మక పునరుద్ధరణ' నినాదాన్నివ్వటాన్ని ఈ సంస్థలు వ్యతిరేకించాయి. 2000 సం॥ జరిగిన ఎన్నికలలో ఎమ్‌డిసి విజయం సాధించింది.

ముగాబే ఒకవైపున ఎమ్‌డిసిపై నిర్బంధాన్ని ప్రయోగించటంతోపాటు, పరిమితంగా భూమిని స్వాధీనం చేసుకోవటానికి అనుమతించి దానినే ఒక అభివృద్ధికర ముఖంగా అడ్డుపెట్టుకున్నాడు. కానీ సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా నిజాయితీగా పోరాటాన్ని ఏమాత్రం చేయలేదు.

అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాలు జింబాబ్వేపై అనేక ఆంక్షలు విధించటంతోపాటు ముగాబే పతనం కోసం చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నాయి. విదేశీ పెట్టుబడికోసం 'తూర్పు వైపు చూసే' విధానాన్ని ముగాబే చేపట్టాడు. ఆంక్షల కారణంగా ఏర్పడిన ఖాళీని అవకాశంగా తీసుకుని దానిని పూరించటానికి చైనా ముందు కొచ్చింది. వజ్రాలు ఇతర ఖనిజాల వెలికితీత రంగాల్లో చైనా పెట్టుబడులు పెడుతోంది.

గనుల తవ్వకం ద్వారా – గనుల తవ్వక పరిశ్రమలకు, ఉన్నత సైనికాధికారవర్గానికి నడుమ గరిష్ట సంబంధం ఏర్పడింది. చైనా కంపెనీలు వందల కోట్ల డాలర్లను పెట్టుబడిగా పెట్టి ఇంధన, మౌలికసదుపాయాల కల్పన రంగాల్లో ఒప్పందాలు చేసుకున్నాయి. జింబాబ్వే వజ్రాల సంపదను ప్రైవేటు కంపెనీలు దోపిడీ చేసుకున్నాయని, ఈ వజ్రాల తవ్వకాన్ని తాను జాతీయం చేయబో తున్నానని ముగాబే ప్రకటించాడు. 2014 సం॥లో 47 లక్షల క్యారెట్ల వజ్రాలను జింబాబ్వే ఉత్పత్తి చేసింది. విదేశీ పెట్టుబడిదారులకు నష్టం కల్గించే కొన్ని చర్యలను ముగాబే తీసుకున్నాడు.

ప్రస్తుత సైనిక తిరుగుబాటుకు ఒక వారం ముందుగా జింబాబ్వే సైనిక ప్రధాన అధికారి బీజింగ్‌లో వుండి చైనా ఉన్నత సైనికాధికారులతో చర్చలు జరిపాడు.

తనను పదవి నుండి తొలగించిన తర్వాత మనన్‌గాగ్వా దక్షిణాఫ్రికాలో ఆశ్రయం పొందాడు. శాంతియుతంగా అధికారం బదలాయింపు జరిగేలా చూడమని ముగాబేకు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జోమా చెప్పాడు. దక్షిణాఫ్రికా రక్షణ మంత్రిని, సైనికాధికారులను తోడు ఇచ్చి మనన్ గాగ్వాను వెనుకకు పంపి 'ముగాబేను, జింబాబ్వే రక్షణ బలగాలను కలవవలసిందిగా' ఆయన కోరాడు. కనుక, సైనిక తిరుగుబాటు పథకం ప్రకారం జరిగినదేనని, చైనాకు ఇతర పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులకు ఇది జరగటానికి చాలా ముందుగానే తెలుసనేది స్పష్టమౌతోంది.

ఆఫ్రికా 'విముక్తికారులలో' చివరివాని యొక్క ముగింపును, జింబాబ్వేలో ముగాబే పతనం సూచిస్తోంది. ముగాబే ఆధ్వర్యంలో మనన్‌గాగ్వా అంతర్గత భద్రతాధికారిగా వుండి, ముగాబే యొక్క అన్ని నిర్బంధ విధానాలను అమలుచేశాడు. ప్రస్తుత పరిస్థితిని అతని ఆధ్వర్యంలోని పాలనేమీ మార్చకపోగా, మరింతగా అవే విధానాలను దృఢతరం చేయనుంది.

జింబాబ్వే ప్రమాదకరమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం బాగా పెరిగి పోయింది. జింబాబ్వే ఎగుమతుల ధరలను సామ్రాజ్యవాదులు బాగా తగ్గించివేశారు. సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు ఆదేశించిన మరిన్ని పొదుపు చర్యలను విధించటం మినహా మనన్ గాగ్వా ముందు మరో ప్రత్యామ్నాయం లేదు.

జింబాబ్వేలోని శిష్టపాలకవర్గం మధ్యనున్న ముఠా తగవులను సైనిక తిరుగుబాటు ప్రస్తుతానికి పరిష్కరించింది. ప్రజలపై నిర్బంధంలో ఇది కొంత విరామాన్ని కల్పించినప్పటికీ, సహజ వనరులను దోపిడీచేసే సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి అనేక రెట్లు పెరగనుండటంతో నిర్బంధం కూడా అదే స్థాయిలో పెరగనుంది. తమ భవితవ్యాన్ని నిర్ణయించుకోవటం, జింబాబ్వే ప్రజల చేతుల్లోనే వుంది.

oooooo